సాక్షి మహబూబ్‌నగర్

గురువారం । 28 । మార్చి । 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36 (గురువారం సాయంత్రం)

సహర్ 4-53 (శుక్రవారం తెల్లవారుజామున)



పాత పైప్‌లైన్‌కే కనెక్షన్

అప్పంపల్లిలో పాత పైప్‌లైన్‌కే మిషన్ భగీరథ కనెక్షన్ ఇవ్వడంతో లీకవుతోంది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.4 /18.7

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

అంతా సిద్ధం..

నేడు మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక



ఎన్నికల సామగ్రి పంపిణీని పరిశీలిస్తున్న పరిశీలకురాలు వాణిప్రసాద్, కలెక్టర్ రవినాయక్ తదితరులు

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- మొత్తం 1,439 మంది ఓటర్లు.. 10 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- బ్యాలెట్ తదితర ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి
- ప్రతి సెంటర్‌కు మైక్రో అబ్జర్వర్.. పోలీసుల పటిష్ట బందోబస్తు
- కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి నవీన్ కుమార్‌రెడ్డి పోటీ
- గెలుపుపై ఎవరిధీమా వారిదే.. గురువారం ప్రత్యేక బస్సుల్లో రాక
- ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక క్లైమాక్స్‌కు చేరింది. గురువారం పోలింగ్ జరగనుండగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఈ మేరకు ఎన్నికల అధికారులు అంతా సిద్ధం చేశారు. స్థానిక సంస్థల పరిధిలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులు, పురపాలక కౌన్సిలర్లు.. వీరితోపాటు ఎక్స్ అఫీషియో హోదాలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 14 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలతో పాటు ముగ్గురు ఎమ్మెల్సీలు మొత్తం 1,439 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వచ్చే నెల రెండో తేదీన మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

ఎవరి ధీమా వారిదే..

ఈ ఉపఎన్నికలో కాంగ్రెస్ నుంచి పారిశ్రామిక వేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి జెడ్పీ మాజీ చైర్మన్ నవీన్‌కుమార్‌రెడ్డి పోటీ పడుతున్నారు. 2021లో బీఆర్‌ఎస్‌కు పూర్తిస్థాయిలో బలముండగా.. అప్పటి పార్టీ అభ్యర్థులు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో బీఆర్‌ఎస్‌కు 1,039 మంది, కాంగ్రెస్‌కు 241 మంది, బీజేపీకి 119, ఇతరులు 46 మంది ప్రజాప్రతినిధులు ఉన్నారు. అయితే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిలో బరిలో నిలిచి గెలుపొందారు. ఈ క్రమంలో ఆయన ఎమ్మెల్సీగా రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం.. ఆ తర్వాత మారిన రాజకీయ పరిణామాల క్రమంలో బీఆర్‌ఎస్‌కు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ నేపథ్యంలో హస్తం శ్రేణుల్లో గెలుపుపై ధీమా వ్యక్తమవుతోంది. బీఆర్‌ఎస్ సైతం తమదే గెలుపు అని చెబుతోంది.

ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు..

మొత్తం ఓటర్లు	1,439
మహిళలు	795
పురుషులు	644
కౌన్సిలర్లు	449
ఎంపీటీసీలు	888
ఎమ్మెల్యేలు	14
జెడ్పీటీసీలు	83
ఎంపీలు	2
ఎమ్మెల్సీలు	3

పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల వివరాలు..

పోలింగ్ స్టేషన్	పురుషులు	మహిళలు	మొత్తం
ఎంపీడీఓ కార్యాలయం, మహబూబ్‌నగర్	117	128	245
ఎంపీడీఓ కార్యాలయం, కొడంగల్	27	29	56
ఎంపీడీఓ కార్యాలయం, నారాయణపేట	89	116	205
ఆర్డీఓ ఆఫీస్, వనపర్తి	99	119	218
జెడ్పీ కార్యాలయం, జోగుళాంబ గద్వాల	91	134	225
బాలికల జూనియర్ కళాశాల, కొల్లాపూర్	28	39	67
బాలుర జెడ్పీహెచ్‌ఎస్, నాగర్‌కర్నూల్	48	53	101
బాలికల జెడ్పీహెచ్‌ఎస్, అచ్చంపేట	37	42	79
ప్రభుత్వ జూనియర్ కళాశాల, కల్వకుర్తి	31	41	72
ఎంపీడీఓ కార్యాలయం, షాద్‌నగర్	77	94	171

రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి..

లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న పోరు కావడంతో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకోగా.. షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటివరకు ఊహించని రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకుని పరువు కాపాడుకోవాలని బీఆర్‌ఎస్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్.. ఈ ఎన్నికల్లో సైతం గెలిచి సత్తా చాటాలని పట్టుదలతో ముందుకు సాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఇలాకాలో జరుగుతున్న ఉపఎన్నిక కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

క్రాస్ ఓటింగ్ బెంగ..

ఓటర్లు చేజారొద్దనే ఉద్దేశంతో వారిని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పోటాపోటీగా గోవా, ఊటీ, కొడైకెనాల్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన క్యాంప్‌లకు తరలించాయి. గురువారం పోలింగ్ జరగనుండగా.. బుధవారం తెల్లవారుజామునే క్యాంపుల నుంచి తరలించినట్లు తెలుస్తోంది. రాత్రికి వారిని హైదరాబాద్‌లో రిసార్ట్స్‌కు తరలించి.. గురువారం ఉదయం నేరుగా ప్రత్యేక బస్సుల్లో ఆయా పోలింగ్ సెంటర్లకు తీసుకురానున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్సీ అభ్యర్థులు ఇరువురిలోనూ క్రాస్ ఓటింగ్ టెన్షన్ పట్టుకుంది. ఇప్పటివరకు అంతా సజావుగా జరిగినప్పటికీ.. చివరి నిమిషంలో ప్రజాప్రతినిధులు ఎవరు ఎటు వైపు మొగ్గు చూపుతారోననే భయం వారిలో నెలకొన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

150 మంది బలగాలతో పహారా

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా పోలీస్ భారీ భద్రత కల్పిస్తోంది. ఎంపీడీఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరం నుంచి ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం 150 మంది పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు, రెండు స్పెషల్ పార్టీ బలగాలు ఎన్నికల విధుల్లో పాల్గొంటారు. ముగ్గురు డీఎస్పీలు అనుక్షణం బందోబస్తు పర్యవేక్షించనున్నారు. వంద మీటర్ల దూరం నుంచి ఓటర్ల నడుచుకుంటూ వెళ్లాలని, ఓటర్లను ఎవరూ కూడా భయభ్రాంతులకు గురి చేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి..

బ్యాలెట్ ద్వారా ప్రజాపతినిధులు ఓట్లు వేయనున్నారు. ఈ మేరకు బుధవారం ఉమ్మడి జిల్లా కేంద్రంగా అన్ని పోలింగ్ సెంటర్లకు ఎన్నికల సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు. ప్రత్యేక వాహనాల్లో వీటిని పోలింగ్ స్టేషన్లకు తరలించారు. ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లలో భాగంగా ప్రతి సెంటర్‌కు ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. అదనంగా మరో ఐదుగురిని అందుబాటులో ఉంచారు.



పోలీస్ బందోబస్తు మధ్య సామగ్రితో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

పకడ్బందీగా ఉపఎన్నికల నిర్వహణ

మహబూబ్‌గర్ న్యూటౌన్: జిల్లాలో గురువారం జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉపఎన్నిక పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఉమ్మడి జిల్లాలోని 10 పోలింగ్ కేంద్రాలకు మెటీరియల్ పంపిణీని ఉపఎన్నిక పరిశీలకురాలు వాణిప్రసాద్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంపిణీ చేసిన పోలింగ్ మెటీరియల్‌ను పోలీసు భద్రత మధ్య పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు. అంతకు ముందు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ అధికారులకు కీలక సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు సంబంధించి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రవినాయక్ పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి అజాగ్రత్త వహించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పీఆర్‌ఈఈ నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

విధుల్లో బాధ్యతగా పాల్గొనాలి

మహబూబ్‌గర్ న్యూటౌన్: ఎమ్మెల్సీ ఉప ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని స్థానిక సంస్థల ఉపఎన్నిక పరిశీలకులు వాణిప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సూక్ష్మ పరిశీలకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేసిన 10 పోలింగ్ కేంద్రాల్లో ఉపఎన్నిక పోలింగ్ పకడ్బందీగా జరపాలన్నారు. సూక్ష్మ పరిశీలకుల విధులు, బాధ్యతలపై సూచనలు చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ర్యాండమైజేషన్ పూర్తి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక నేపథ్యంలో కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను ఉపఎన్నికల పరిశీలకురాలు వాణిప్రసాద్ పూర్తి చేశారు. ఉపఎన్నిక జరగనున్న 10 పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను నియమించారు.

ఏసీబీ వలలో గుండుమాల్ తహసీల్దార్

- భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇచ్చేందుకు రూ.3వేలు డిమాండ్
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
- తహసీల్దార్‌తోపాటు ధరణి ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్లపై కేసులు నమోదు

- కోస్గి



- వివరాలు 8లో..

ముగిసిన వట్టెం బ్రహ్మోత్సవాలు

ఫోన్ ట్యాంపరింగ్‌పై ఎస్పీకి ఫిర్యాదు

- వివరాలు 8లో..

న్యూస్‌రీల్

కోర్టులో అందుబాటులోకి ఈ-సేవ కేంద్రం



పాలమూరు: న్యాయ సేవలను సులభతరం చేసేందుకే ఈ-సేవ కేంద్రాల ద్వారా న్యాయ సేవలను ప్రారంభించడం జరిగిందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ హైదరాబాద్‌లో తెలంగాణలోని అన్ని జిల్లా కోర్టులలో ఈ-సేవా కేంద్రాల ద్వారా సేవలను బుధవారం ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ కోర్టులో ఏర్పాటు చేసిన ఈ-సేవ కేంద్రాన్ని న్యాయమూర్తి బి.పాపిరెడ్డి ప్రారంభించి మాట్లాడారు. న్యాయ సేవలను ప్రజలకు సులువైన పద్ధతిలో అందించడం కోసం ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆలోచన విధానం వల్లే ఈ కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఈ సేవను కక్షిదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సంధ్యారాణి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామనాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జైలులో వసతులపై ఆరా

మహబూబ్‌నగర్ క్రైం: జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు న్యాయపరమైన సమస్యలు ఉంటే లోక్ అదాలత్‌లోని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ను సంప్రదించాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని జైలును గురువారం న్యాయమూర్తి సందర్శించి ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఖైదీలకు బెయిల్ సమస్యలు ఉంటే న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలన్నారు.

– జిల్లాలోని ప్రతి గ్రామంలోకి నల్సా పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలో న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రణాళికతో గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

నేడు పీయూలో వర్క్‌షాప్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణపై గురువారం పాలమూరు యూనివర్సిటీలో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ పీయూ ఆధ్వర్యంలో వర్క్ షాప్ గురువారం వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. పర్యావరణ మార్పులపై ప్రతిఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని, ప్లాస్టిక్‌తో పర్యావరణానికి పెద్ద ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా రీసోర్సుపర్సన్ పద్మ పలు అంశాలను వివరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదనరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్, హెచ్‌ఓడీ జంగం విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి క్వింటాలు రూ.7,111

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తికి క్వింటాలు గరిష్టంగా రూ.7,111, కనిష్టంగా రూ.6,501 ధరలు లభించాయి. అలాగే వేరుశనగ గరిష్టంగా రూ.7,036, కనిష్టంగా రూ.4,650, ఉలువలు గరిష్టంగా రూ.6,819, కనిష్టంగా రూ.6,649, పెసర్లు రూ.3,819, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,231, కనిష్టంగా రూ.2,021, ఆముదాలు గరిష్టంగా రూ.5,859, కనిష్టంగా రూ.5,454, జొన్నలు గరిష్టంగా రూ.5,090, కనిష్టంగా రూ.3,081 చొప్పున వచ్చాయి.

వైభవంగా వసంతోత్సవం




మన్యంకొండ గుట్టపై బావిలో సుదర్శన పెరుమాళ్లకు శ్రీచక్రస్నానం చేయిస్తున్న పురోహితులు

- స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు శ్రీచక్రస్నానం
- మన్యంకొండలో ముగిసిన అలివేలు మంగతాయారు ఉత్సవాలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ అలివేలు మంగతాయారు ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణాహుతి, అవబృత స్నానం, నాకబలి (నాగవెల్లి), ద్వాదశరాధన, సప్తవరణులు, మహాదాశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామివారి సుదర్శన పెరుమాళ్లను ఊరేగింపుగా దిగువ కొండ వద్దనున్న అమ్మవారి దేవస్థానం నుంచి ఘాట్‌రోడ్డు గుండా గుట్టపైనున్న బావి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి స్వామివారి సుదర్శన పెరుమాళ్లకు పురోహితులు సంప్రదాయబద్ధంగా శ్రీచక్ర స్నానం చేయించారు. మళ్లీ సుదర్శన పెరుమాళ్లను ప్రత్యేక పూలతో శోభాయమానంగా అలంకరించి దిగువ కొండ వద్దనున్న అమ్మవారి దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి విశేషోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజలతో అమ్మవారి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

వేలం లేకుండానే ఉల్లి ధరల ఖరారు



ఉల్లి కుప్పలతో నిండిపోయిన దేవరకద్ర మార్కెట్

- ఎవరికి వారుగా కొనుగోలు
- క్వింటాల్‌కు గరిష్టంగా రూ.1,500.. కనిష్టంగా రూ.900

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం వేలం లేకుండానే ఉల్లి ధరలను ఖరారు చేసి వ్యాపారులు నేరుగా కొనుగోలు చేశారు. దిగుబడులు పెరగడంతో మార్కెట్‌కు పెద్దఎత్తున ఉల్లి అమ్మకానికి వచ్చింది. రెండు నెలలుగా ప్రతి వారం పెద్ద మొత్తంలో వస్తున్న ఉల్లిని పూర్తిస్థాయిలో వేలం వేయలేకపోతున్నారు. దీంతో ఉల్లి తూకాలు వేసి అమ్మకాలు చేయడానికి ఆలస్యమయ్యేది. ఇలా సమయం సరిపోక వేలం వేయకుండా వదిలేసిన ఉల్లిని తక్కువ ధర నిర్ణయించి వ్యాపారులు కొనేవారు. దీన్ని అధిగమించి సరైన ధరలు రావడంతోపాటు సమయం కలిసి వస్తుందని వ్యాపారులు వేలం వేయకుండానే ఎవరికి వారు ఉల్లిని నేరుగా కొనుగోలు చేశారు. మార్కెట్‌లో దాదాపు 40 మంది ట్రేడర్స్ వారి షాపులకు రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లిని వారే ధరలు నిర్ణయించి కొనుగోలు చేశారు. కొందరు వ్యాపారులకు ఎక్కువగా వచ్చిన ఉల్లిని ఇతర వ్యాపారులకు నేరుగా విక్రయించారు. దీంతో ఉదయం 10 గంటల లోపే ఉల్లి కుప్పలకు ధరలు ఖరారు చేశారు. దీంతో వెంటనే తూకాలు వేసి అమ్మకాలు సాగించారు.

అవే ధరలు నమోదు..

దేవరకద్ర మార్కెట్‌లో వేలం లేకుండానే ఉల్లి ధరలు నిర్ణయించినా ఈసారి కూడా గత వారం ధరలే నమోదయ్యాయి. నాణ్యతగా ఉన్న ఉల్లి గరిష్టంగా రూ.1,500, కనిష్టంగా రూ.1,300 వరకు ధరలు పలికాయి. ఎర్ర ఉల్లి, నాణ్యత లేని ఉల్లి ధర గరిష్టంగా రూ.1,200, కనిష్టంగా రూ.900 వరకు వచ్చాయి. మార్కెట్‌కు దాదాపు 5 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. నాణ్యతగా ఉన్న ఉల్లి 45 కిలోల బస్తా గరిష్టంగా రూ.750, కనిష్టంగా రూ.650 చొప్పున విక్రయించారు. అలాగే ఎర్రఉల్లి బస్తా గరిష్టంగా రూ.600, కనిష్టంగా రూ.450 వరకు అమ్మారు.

‘మోదీని చూసే ప్రజలు ఓట్లేస్తారు’



పార్లమెంట్ మేనేజ్‌మెంట్ కమిటీలో చర్చిస్తున్న డీకే అరుణ తదితరులు

పాలమూరు/ జడ్చర్ల టౌన్: ‘దేశంలో మోదీ గ్యారంటీకి మించినది మరొకటి లేదు.. ఆయనను చూసే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓట్లు వేస్తార’ని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. బుధవారం పట్టణంలోని వెంకటేశ్వరకాలనీ, సరస్వతినగర్‌లో పార్టీ కార్యాలయాలను ప్రారంభించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌ను చూసి ప్రజలు ఓటేయలేదని, బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకతతో కాంగ్రెస్‌కు ఓటేశారన్నారు. ఇంట్లో పెద్ద మనిషిని చూసి పిల్లను ఇచ్చినట్లే మోదీని చూసి ఓట్లు వేస్తారన్నారు. కాంగ్రెస్ వందరోజుల పాలనపై ప్రజల్లో అసంతృప్తి మొదలైందని, ప్రజలను మోసం చేసిన విధానాలను ఆనాడు బీజేపీ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేది లేదు.. రాహుల్ ప్రధాని అయ్యేది లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని, పాలమూరు అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని, అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్న మోదీ విజన్‌ను పాలమూరులో నెరవేరుస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జక్కా రఘునందన్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్, బాలత్రిపురసుందరిదేవి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయం

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని డీకే అరుణ అన్నారు. జిల్లాకేంద్రం పద్మావతికాలనీలోని ఆమె నివాసంలో నిర్వహించిన పార్లమెంట్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ నేతలతోపాటు కార్యకర్తలు ఐక్యంగా ముందుకెళ్లి యువతపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. ఉదయం డైట్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో మాట్లాడి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు నాగురావు నామాజీ, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, కొండయ్య, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజయ్య, కృష్ణవర్ధన్‌రెడ్డి, బుడ్డన్న, సాహితీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14 స్థానాల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం బూత్‌లెవల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలన్నీ తప్పకుండా అమలు చేస్తామన్నారు. మన ప్రాంతానికి సాగు, తాగునీరు అందేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పునాది అని, కష్టపడి పని చేస్తేనే మనం అనుకున్న లక్ష్యానికి చేరుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడిన వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యత నాదని, నన్ను ఆశీర్వదించి ఈ ఎన్నికల్లో ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు సురేందర్‌రెడ్డి, ఎన్పీ వెంకటేశ్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్ యాదవ్, అజ్మత్‌అలీ, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి

ఆత్మకూర్: వ్యవసాయ పనులకు వెళ్లిన రైతు పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని ఆరేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు ఇలా.. ఆరేపల్లికి చెందిన ఏటికాడి చిన్న నాగన్న(63) మంగళవారం రాత్రి 10 గంటలకు ఇంటి నుంచి పొలానికి వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున పాము కాటి వేసిందని కుటుంబసభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని..

- యువకుడు బలవన్మరణం


రాజు (ఫైల్)

అమరచింత: వివాహ విషయంలో తల్లితండ్రులే తనను హేళన చేస్తూ, మందలించారని అవహేళన చేస్తూ మందలిస్తున్నారని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలోని పాంరెడ్డిపల్లెకు చెందిన రఘుపతిరెడ్డికి ఇద్దరు కుమారులు, కుమార్తె. వీరిలో చిన్న కుమారుడి వివాహంతో పాటు కూతురి వివాహం చేశారు. మిగిలింది పెద్ద కుమారుడు రాజు(22) పెళ్లి విషయంపై తరచూ ఇంట్లో గొడవలు జరుగుతుండేవి. డిగ్రీ చదువుతూ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్న రాజు కొన్ని రోజుల కిందట ఇంటికి వచ్చాడు. రాజుతో తల్లితండ్రులు పెళ్లి ప్రస్తావన తీసుకువచ్చారు. ఎవరి ఇంటికైన సదత్తతగా వెళ్లాలని, ఇన్నేళ్లయినా పెళ్లి ఎందుకు చేసుకోవడం లేదన్న విషయాలపై కొడుకుతో వాదనకు దిగారు. తల్లితండ్రులు చెప్పిన మాటలకు విసుగు చెందిన రాజు మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో తన తల్లి చీరను తీసుకుని బైక్‌పై బయటకు వచ్చాడు. మన్యం కొండలోని రాళ్ల మధ్యలో చెట్టుకు తల్లి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మన్యంకొండ గుట్టకు పశువులను తీసుకెళ్లిన కాపారులు మృతదేహం గురించి పోలీసులకు సమాచారం అందించారు .పోలీసులు రాజు తల్లితండ్రులకు సమాచారం అందించారు. బుధవారం సాయంత్రం మృతదేహన్ని పాంరెడ్డిపల్లెకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్‌పై వెళ్తున్న యువకుడిపై కత్తితో దాడి

బల్మూర్: బైక్‌పై వెళ్తున్న ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని మైలారం స్టేజీ వద్ద చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బత్తుల వినోద్ తన బైక్‌పై అచ్చంపేట నుంచి కిరాణ సామాను తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. వెనుక వైపు నుంచి హెల్మెట్లు ధరించి మరో వాహనంపై వెంబడించిన ముగ్గురు అతని వీపుపై కత్తితో దాడి చేసేందుకు ప్రయత్నించారు. గమనించిన వినోద్ తప్పించుకోనేందుకు ప్రయత్నించడంతో అతని కుడి తొడపై కత్తి పోటు పడింది. ఆయన కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. గాయాలపాలైన వినోద్ జరిగిన విషయన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. చికిత్స నిమిత్తం యువకుడిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌పాష తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తగు చర్యలు తీసుకుంటామని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా ఈ ఘటనలో అచ్చంపేట పట్టణానికి చెందిన యువకుడి బంధువులే ఉన్నట్లు బాధితుడితో పాటు కుటుంబసభ్యులు ఆరోపించారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలుశిక్ష

మక్తల్: భార్యపై వరకట్న వేధింపులకు పాల్పడిన భర్తకు జైలు శిక్ష, జరిమానా కోర్టు విధించింది. మండలంలోని భూత్పూర్ చెందిన హరిజన్ నర్సింహ 2020, అక్టోబర్ 10వ తేదీన భార్య నర్సమ్మ కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్‌ఐ రాములు కేసు నమోదు చేశారు. పూర్తి స్థాయిలోకేసు విచారణ చేయగా నర్సమ్మ భూత్పూర్ రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలు తల్లి భీమమ్మను విచారణ చేయగా నర్సమ్మ, హరిజన్ నర్సింహలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారని తెలిపారు. భర్త, వారి తల్లిదండ్రులు నర్సమ్మను అదనపు కట్నం కోసం తరుచూ వేధిస్తుండేవారని తెలిపారు. దీనిపై 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా బుధవారం నారాయణపేట జడ్జి అబ్దుల్ రఫి కోర్టులో తీర్పునిచ్చారని ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు.

వాహనం బోల్తా: నలుగురికి గాయాలు



నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రం సమీపాన నాగనూలు శివారులో నాగర్‌కర్నూల్ వైపు వస్తున్న బలెరో వాహనం బుధవారం అదుపు తప్పి బోల్తా పడింది. ఇందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో బయట పడడంతో ప్రమాదం తప్పింది. స్వల్ప గాయాలపాలైన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


గుడూర్ స్టేజీ వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీని సరిచేస్తున్న సిబ్బంది

పాత పైపులైన్‌కే.. మిషన్‌భగీరథ కనెక్షన్

- పలుమార్లు లీకేజీలు
- గ్రామాలకు కలుషితనీరు సరఫరా

చిన్నచింతకుంట: గ్రామాలకు తాగునీరు అందించే మిషన్ భగీరథ పైపులైన్ తరుచూ లీకేజీలు అవుతున్నాయి. దీంతో మండలంలోని వివిధ గ్రామాలకు నీటి సరఫరా కలుషితమవుతుంది. కురుమూర్తిరాయ హెడ్‌ట్యాంక్ నుంచి అప్పంపల్లి వరకు సాయిబాబా ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన పాత పైపులైన్‌కే మిషన్ భగీరథ కనెక్షన్ కలపడంతో తరుచూ పైపులు పగిలి లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో మండలంలోని 13 గ్రామాలకు తాగునీటి సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. గ్రామాలకు నీరు ఎప్పుడు సరఫరా అవుతుందో కూడా ప్రజలకు తెలియడం లేదు. అధికారులు పైపులను సరిచేసి నీటిని వదిలిన అది కలుషితంగా సరఫరా అవుతుంది.


కురుమూర్తి వద్ద ఉన్న హెడ్ వాటర్ ట్యాంక్

నిధులు దుర్వినియోగం..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామాలకు తాగునీరు అందించే దిశలో రూ.కోట్లు ఖర్చు చేసింది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నిధులను దుర్వినియోగ పరిచారు. పాత పైపులైన్లకే మిషన్‌భగీరథ కనెక్షన్లు ఇచ్చారు. అప్పట్లో మండలంలోని 13 గ్రామాలకు రామన్‌పాడు ప్రాజెక్ట్ నుంచి, మన్యంకొండ హెడ్ ట్యాంక్ నుంచి 9 గ్రామాలకు అప్పటి అధికారులు పైపులను అమర్చి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే రామన్‌పాడు ప్రాజెక్ట్ నుంచి కురుమూర్తి హెడ్‌ట్యాంక్ వరకు కొత్తగా పైపులు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ముచ్చింతల వరకు 40 సంవత్సరాల క్రితం షిరిడి సాయిబాబా ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేసిన పాత పైపులైన్‌కు లింక్ కలిపారు. అందుకు కురుమూర్తి నుంచి ముచ్చింతల వరకు ఏదో ఒక చోట లీకేజీలు అవుతూనే ఉన్నాయి. దీంతో మండల కేంద్రం, అమ్మాపురం, తిర్మలాపూర్, మద్దూర్, ఏదులాపూర్, దాసర్‌పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల గ్రామాలకు నీరు సక్రమంగా అందకపోగా నాచు, బురద, వేర్లు వంటి కలుషితమైన నీరు సరఫరా అవుతుంది. పాత పైప్‌లైన్ తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని మండల సర్వసభ్య సమావేశాలల్లో సర్పంచులు, ఎంపీటీసీలు లేవనెత్తిన అధికారులలో స్పందన రాలేదు.

తాగునీటిని సరఫరా చేయాలి



మిషన్ భగీరథ తాగునీరు అందించే పైపులైన్ లీకేజీలు అవుతున్నాయి. దీంతో గ్రామానికి కలుషిత నీరు అందుతుంది. ఈ నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఐదేళ్లుగా ఇలాగే కొనసాగుతుంది. పలుమార్లు మండల సర్వసభ్య సమావేశాల్లో సమస్యపై అధికారులను నిలదీసినా పట్టించుకోలేదు.

– సత్యన్న, మాజీ సర్పంచ్, తిర్మలాపురం

ప్రతిపాదనలు పంపించాం..

మిషన్ భగీరథ పాత పైపులైన్ తొలగించి కొత్తది ఏర్పాటుకు ఇది వరకే ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త పైపులైన్ ఏర్పాటుపై చర్యలు చేపడుతాం. ఎక్కడ లీకేజీలు ఏర్పడినా వెంటనే సరిచేసి గ్రామాలకు తాగునీరు అందిస్తున్నాం. ప్రస్తుతం ఎక్కడా కలుషిత నీరు సరఫరా కావడం లేదు.

– రామకృష్ణ, మిషన్ భగీరథ ఏఈ, చిన్నచింతకుంట

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులు సురక్షితం
- నలుగురికి స్వల్ప గాయాలు



జాతీయరహదారిపై రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

అలంపూర్: బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సు రోడ్డు పక్కకు వెళ్లి ఆగడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ ఘటన ఉండవెల్లి మండలం అలంపూర్‌చౌరస్తా సమీపంలోని ఉత్తర ఫుడ్స్- పుల్లూరు టోల్‌ప్లాజాకు మధ్యన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. పీఆర్‌ఎల్(ఇంద్రాక్షి) ట్రావెల్స్ బస్సు మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఏపీలోని ప్రొద్దుటూరుకు 26 మంది ప్రయాణికులతో బయలుదేరింది. అలంపూర్ చౌరస్తా వద్ద ఉత్తర ఫుడ్స్ ఫ్యాక్టరీ సమీపంలో దాదాపు 3:30 గంటల సమయంలో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బస్సు రోడ్డు దాటి కిందకు దూసుకెళ్లింది. బస్సు కిందకు బోల్తా పడకుండా నిలిచిపోవడంతో ప్రయాణికులు సురక్షితంగా బయపట్టారు. అయితే ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. డ్రైవర్ జనార్దన్ రెడ్డి కాలికి, లక్ష్మిదేవికి తలకు గాయం కావడంతో వారిని హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కర్నూల్ తరలించారు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. పెట్రోలింగ్ పోలీసులకు సమాచారం అందడంతో ఘటనపై ఆరా తీశారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఉండవెల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఫోన్ ట్యాంపరింగ్‌పై ఎస్పీకి ఫిర్యాదు


ఎస్పీ కార్యాలయం వద్ద బురుజు సుధాకర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ క్రైం: గత ప్రభుత్వ హయంలో వన్‌టౌన్ సీఐగా పని చేసిన అధికారితో పాటు కొంత మంది సిబ్బంది మాజీ మంత్రి ఆదేశాలతో ఫోన్ నంబర్లను ట్యాప్ చేశారని బుధవారం ఎస్పీ హర్షవర్ధన్‌కు 43వ వార్డు కౌన్సిలర్ బురుజు సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు నుంచి పట్టణంలో కొంత మంది ప్రముఖల ఫోన్ నంబర్లు ట్యాప్ చేశారన్నారు. ఎవరితో ఎవరూ మాట్లాడుతున్నారో తెలుసుకుని వెంటనే స్టేషన్‌కు పిలిచి బెదిరించేవారని, వినకుంటే తప్పుడు కేసులు పెట్టారన్నారు. ఈ అంశంపై సరైన విచారణ చేసి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడిపందెల శిబిరంపై దాడి

- 11 మంది అరెస్ట్, రూ.13,100 నగదు స్వాధీనం

నాగర్‌కర్నూల్: కోడిపందెలు ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి పలువురిని అరెస్టు చేసిన ఘటన మండలంలోని చందుపట్ల శివారులో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం నాగర్‌కర్నూల్, తెలకపల్లి మండలాలకు చెందిన 11మంది కోడిపందాలు ఆడుతున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు 11 మందిని అరెస్టు చేయడంతో పాటు రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద రూ.13,100 నగదు తో పాటు ఆరు ద్విచక్ర వాహనాలు 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చేపల పెంపకంపై అవగాహన

పెబ్బేరు రూరల్: ఆక్వా ఫోనిక్స్ విధానంలో చేపలు, మొక్కల పెంపకంపై బుధవారం మండల కేంద్రంలోని మత్స్యకళాశాలలో ఎస్ఎంఆర్‌ఐ సాయంతో ఎస్సీ రైతులకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ నాగలక్ష్మి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాతిమా, ఏఓ చంద్రమౌళి పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి తగ్గట్లు వ్యవసాయ పద్ధతులు కూడా మారాలని, తక్కువ స్థలం, తక్కువ నీటితో ఎక్కువ లాభం వచ్చే వ్యవసాయ విధానాలలో ఆక్వా ఫోనిక్స్ ముఖ్యమైనదని పేర్కొన్నారు. వివిధ రకాల చేపల పెంపకాల గురించి, ఆక్వాఫోన్సికి అనువైన చేపలు, మొక్కల గురించి వివరించారు.

ముగిసిన వట్టెం బ్రహ్మోత్సవాలు


గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులు

బిజినేపల్లి: వట్టెం వేంకటేశ్వరస్వామి 38వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. 22వ తేదీ నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఆలయ స్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణచార్యులు, ప్రధాన అర్చకుడు వెంకట ప్రసాదచార్యులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మ వార్లకు శాస్త్రోక్తంగా హోమం, అభిషేకం నిర్వహించారు. ఆలయ పుష్కరిణిలో స్వామి వార్లకు చక్రస్నాన ఘట్టాన్ని ఘనంగా చేపట్టారు. అనంతరం పుష్పయాగ ద్వాదశారాధన, సప్తావరణంతో ధ్వజారోహణతో ఆరు రోజుల పాటు సాగిన బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. ముగింపు కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కైంకర్యపరులు అనంత క్రాంతికుమార్‌రెడ్డి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అడవులపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిల సమీపంలో ఉన్న ఎకో పార్క్‌లో స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఫారెస్టు రేంజర్ శరత్ చంద్రరెడ్డి అడవులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న వాచ్ టవర్, వ్యూవ్ పాయింట్ వద్దకు విద్యార్థులను తీసుకెళ్లారు. ప్రకృతి సహజ సంపదలో అడవులు చాలా ముఖ్యమైనవని తెలిపారు. అడవుల వల్ల సమస్త జీవరాశికి కావాల్సిన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. అదేవిధంగా అనేక వన్యప్రాణులు ముఖ్యంగా సోమశిల అడవులలో పులి, జింకలు, ఎలుగుబంట్లు, దుప్పులు తదితర జంతువులు నివసిస్తున్నాయని వివరించారు. పులి జీవన విధానాన్ని, వాటి పంజా గుర్తుల ఆధారంగా మగ, ఆడ పులులను గుర్తించే విధానాన్ని, ప్రకృతి సమతుల్యతతో దాని పాత్ర గురించి, పులులను కాపాడుకోవడంలో మానవుల పాత్రపై వివరించారు. కార్యక్రమంలో ఫారెస్టు బీట్ అధికారి శ్యామ్ సుందర్ యాదవ్, అధ్యాపకులు రమేష్, కురుమయ్య, మౌనిక, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలీం ఆజాద్‌కు రంగస్థల పురస్కారం

చిన్నచింతకుంట: మండలంలోని అప్పంపల్లికి చెందిన ఎండీ అబ్దుల్ కలీం ఆజాద్‌కు రంగ స్థల యువ పురష్కారం లభించింది. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరంచుకుని బుధవారం హైదరబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో విశ్వవిద్యాలయం వీసీ కిషన్‌రావు, లలిత కళాపీఠం పీఠాధిపతి డాక్టర్ కోట్ల హన్‌మంతరావు, బీహెచ్ పద్మప్రియ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.


పురస్కారం అందుకుంటున్న అబ్దుల్ కలీం ఆజాద్

తాతయ్య వర్ధంతి కోసం వస్తుండగా..

లారీ ఢీకొని మనవడు మృతి


పవన్‌కుమార్ (ఫైల్)


నుజ్జునుజ్జయిన బొలెరో వాహనం

మరికల్: తాతయ్య వర్ధంతిని నిర్వహించేందుకు వస్తుండగా, లారీఢీకొని మనవడు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని అంకెన్‌పల్లికి చెందిన ఎం. పవన్‌కుమార్ (21) కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌లో వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం స్వగ్రామంలో తాతయ్య హన్మంతు వర్ధంతి ఉండటంతో పూలు, పండ్లు, ఇతర సామగ్రితో హైదరాబాద్ నుంచి అర్ధరాత్రి స్వగ్రామానికి బొలెరో వాహనంలో బయలుదేరాడు. ఈ క్రమంలో మరికల్ మండలం ఎలిగండ్ల స్టేజీ సమీపంలో ఉన్న మన్నెవాగు వద్ద తెల్లవారుజామున 3 గంటలకు రాయచూర్ నుంచి వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద రూ.9.69 లక్షలు సీజ్

నాగర్‌కర్నూల్: జిల్లాలో ఉన్న ఆరు చెక్ పోస్ట్‌లలో ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో బుధవారం వరకు రూ.9,69,750 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. దీంతోపాటు 48 లిక్కర్ కేసులు చేసి 1,078 ఐఎంఎఫ్‌ఎల్, బీర్ బాటిల్స్, 4 లీటరల నాటు సారా సీజ్ చేసినట్లు తెలిపారు. 94 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 23 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

అనుమతి లేకుండా తరలిస్తున్న నగదు, కూలర్లు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: పోలీసులు బుధవారం చేసిన తనిఖీల్లో పలు చోట్ల నగదు పట్టుబడింది. ప్రధానంగా టూటౌన్ పోలీసులు రూ.3లక్షల విలువ చేసే కూలర్లను పట్టుకున్నారు. కూలర్స్ తరలించే వాహన డ్రైవర్ సలీం వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో కూలర్లతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ స్వామిగౌడ్ వెల్లడించారు. దీంతో పాటు రూ.90వేల విలువ చేసే షర్ట్సను సీజ్ చేశారు. ఈ కూలర్స్‌ను విజయవాడ నుంచి ప్రత్యేకంగా పాలమూరులో పంపిణీ చేయడానికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. కూలర్లను స్థానికంగా ఓటర్లకు చేర్చడానికి ప్రయత్నం చేసినట్లు సమాచారం. బాలానగర్ పోలీసులు రూ.3లక్షలు, భూత్పూర్ పోలీసులు రూ.2లక్షల నగదు సీజ్ చేశారు. మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు ధర్మపూర్‌లో ఐదు లీటర్ల అక్రమ మద్యం సీజ్ చేశారు.

ఏసీబీ వలలో గుండుమాల్ తహసీల్దార్

- భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇచ్చేందుకు రూ.3వేలు డిమాండ్
- వలపన్ని పట్టుకున్న ఏసీబీ అధికారులు
- తహసీల్దార్‌తో పాటు ధరణి ఆపరేటర్, రికార్డు అసిస్టెంట్‌లపై కేసులు నమోదు


గుండుమాల్ తహసీల్దార్ కార్యాలయం


ఏసీబీకి పట్టుబడిన తహసీల్దార్, మరో ఇద్దరు అధికారులు


పట్టుబడిన నగదు

కోస్గి: భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్ ఇవ్వడానికి ఓ రైతు నుంచి లంచం డిమాండ్‌చేసిన గుండుమాల్ తహసీల్దార్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ వివరాల మేరకు.. గుండుమాల్ మండలం బోగారం గ్రామానికి చెందిన రైతు మల్లేష్ అమ్లికుంట్లకు చెందిన ఓ వ్యక్తితో ఎకరా భూమిని కొనుగోలుచేశారు. ఈనెల 21న భూమి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. 22న రిజిస్ట్రేషన్ చేసిన గుండుమాల్ తహసీల్దార్ పాండునాయక్.. డాక్యుమెంట్ ఇవ్వడానికి రూ. 3వేలు డిమాండ్ చేశాడు. తనవద్ద డబ్బులు లేవని రైతు చెప్పగా.. డాక్యుమెంట్ ఇచ్చేందుకు నిరాకరించాడు. దీంతో చేసేదిలేక ధరణి ఆపరేటర్‌కు రూ.1000 ఫోన్‌పే చేసి, మిగిలిన డబ్బులు తర్వాత ఇస్తానని డాక్యుమెంట్ తీసుకున్నారు. రెండు రోజుల వ్యవధిలో రైతు మల్లేష్ మరో వ్యక్తికి 20 గుంటల భూమిని విక్రయించి, రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. ఈక్రమంలో గతంలో తక్కువ డబ్బులు ఇచ్చావని.. ఈ సారి మొత్తం డబ్బులు ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని తహసీల్దార్ మొండికేశాడు. ఇదేంటని ప్రశ్నించిన రైతుకు ఇక్కడ ఇలాగే ఉంటుందంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ.. రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరించాడు. దీంతో బాధిత రైతు ఏసీబీని ఆశ్రయించారు. బుధవారం ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ ముందస్తు ప్రణాళికలో భాగంగా రైతుకు రూ.2000 ఇచ్చి తహసీల్దార్ వద్దకు పంపించగా.. రికార్డు అసిస్టెంట్ మొగులప్పకు ఇవ్వాలని సూచించడంతో బాధిత రైతు అతడికి ఇచ్చారు. ఆ డబ్బులను రికార్డు అసిస్టెంట్ నుంచి తహసీల్దార్ తీసుకుంటుండగా, ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రైతుతో లంచం తీసుకున్న తహసీల్దార్ పాండునాయక్‌తో పాటు ధరణి అపరేటర్ రవీందర్‌రెడ్డి, రికార్డు అసిస్టెంట్ మొగులప్పలపై కేసులు నమోదు చేశామని.. వీరిని నాంపల్లి ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే, ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఏసీబీ సీఐలు ఏఎస్‌కే జిలానీ, పి.లింగస్వామి తదితరులు ఉన్నారు. కాగా, ముఖ్యమంత్రి ఇలాకాలో తహసీల్దార్ ఏసీబీకి పట్టుబడటం సర్వత్రా చర్చనీయాంశమైంది.

డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు బెదిరించారు..



భూమి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఇవ్వడానికి తహసీల్దార్ పాండు నాయక్ డబ్బులు డిమాండ్ చేశాడు. ఇదేంటని అడిగితే ఇవ్వాల్సిందే.. లేదంటే నువ్వే ఇబ్బందులు పడుతావని బెదిరించాడు. రూ. 1,500 అడిగితే రూ.1000 ఇచ్చి, డాక్యుమెంట్ తీసుకున్నాను. మరోమారు నేను మరో వ్యక్తికి భూమి అమ్మితే పాతవి, కొత్తవి కలిపి రూ.2వేలు ఇవ్వాలని మరోమారు దబాయించడంతో ఏసీబీని ఆశ్రయించాను. ఏసీబీ అధికారుల సూచన మేరకు డబ్బులు ఇచ్చాను.

– మల్లేష్, రైతు, బోగారం

క్లుప్తంగా

జన్యుపరమైన వ్యాధులపై వర్క్‌షాప్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సీసీఎంబీ, వీఐటీఎం వారి సౌజన్యంతో జీన్ హెల్త్ కనెక్ట్ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో జన్యుపరంగా వచ్చే వ్యాధుల గురించి తెలుసుకోవాలని, వంశపారపర్యంగా వచ్చే హిమోఫీలియా, సికిల్‌సెల్, డౌన్ సిండ్రోమ్ వంటి వాటిపై అవగాహన అవసరమని అన్నారు. అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబడుతున్న నగదు



బాలానగర్: మండల కేంద్రంలోని చెక్‌పోస్టు వద్ద నిత్యం నగదు పట్టుబడుతూనే ఉంది. బుధవారం సైతం ఎస్‌ఐ తిరుపాజీ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో నారాయణ పేట్ జిల్లా కోస్గి మండలానికి చెందిన అబ్దుల్ రహమాన్ వద్ద ఏకంగా ఒకే వాహనంలో రూ. 3 లక్షల నగదు పట్టుబడిందని పోలీసులు తెలిపారు.

పరామర్శ

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సత్యమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. కాగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సతీమణి కవిత బుధవారం పరామర్శించారు. సత్యమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యమ్మ కుమారుడు పరుషరాములును ఓదార్చారు. పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, ఖాజామైనోద్దీన్, నిరంజన్, వేఘనాథ్, జగదీష్ తదితరులు ఉన్నారు.

మహాసభను జయప్రదం చేయండి



అడ్డాకుల: మండలకేంద్రంలో వచ్చే నెల 2న ఉన్నత విద్యావంతులు, విద్యావేత్తలు, మేధావులతో జరిగే ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు భరత్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన బడ్జెట్‌ను కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేసి కొఠారి కమిషన్ సిఫారసులనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేదంటే ఆందోళనకు పిలుపునిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవరత్నం, కరుణాకర్, నగేష్‌రాజు, నరేందర్ తదితరులు ఉన్నారు.

త్రోబాల్ ఫెడరేషన్ కప్‌కు బాలకృష్ణ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని రాజాపూర్‌కు చెందిన బాలకృష్ణ త్రోబాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపికయ్యాడు. మహారాష్ట్ర షిరిడీలో ఈనెల 29 నుంచి 31 వరకు జరిగే 37వ త్రోబాల్ ఫెడరేషన్ కప్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నాడు. బాలకృష్ణ ఎంపికపై జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదత్‌ఖాన్, మహ్మద్ అహ్మద్ హుస్సేన్, కార్యనిర్వాహక కార్యదర్శి సోహైల్ వుర్ రహెమాన్, కోశాధికారి రాంమోహన్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. త్రోబాల్ ఫెడరేషన్ పోటీల్లో ప్రతిభచాటి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

లోపాలను సరిచేయాలి

నారాయణపేట: పీఎఫ్ లోపాలను అధికారులు వెంటనే సరిచేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు, తెలంగాణ ప్రగతిశీల బీడీవర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పి.అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నిర్వహించిన నిధి అప్కానికాత్ కార్యక్రమంలో ఎన్‌రోల్‌మెంట్ అధికారి సుందర్‌రాజుకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీడీ కార్మికులు జాయింట్ డిక్లరేషన్ ఫామ్స్, వ్యక్తిగత డాక్యుమెంట్స్‌ను అందజేశారు. 2000 సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ఐదువేల మందికిపైగా ఖాతాదారులున్నారన్నారు. చిన్నచిన్న కారణాలతో గతరెండు ఏళ్లుగా పీఎఫ్ డబ్బులు జమా కావడంలేదన్నారు. డెత్ అయిన క్లయిమ్‌లు పరిష్కరించడంలో అనేక నిబంధనలతో కార్మికులకు ప్రయోజనం లేదన్నారు. రెండేళ్లుగా జిల్లాలోని కార్మికుల డబ్బులు జమా కావడం లేదని.. పేర్కొనఆరు. ఇప్పటికైనా తప్పులను సరిచేసి న్యాయం చేయాలని అధికారులను కోరారు.

ఎండుతున్న పంటలు

- భూగర్భజలాలు అడుగంటడంతో అవస్థలు
- సగానికి పైగా సాగు తగ్గినా ఇబ్బందులు తప్పని వైనం



కాకర్లపహాడ్‌లో..



నవాబుపేటలో నీరందక వాలిపోయిన వరి

నవాబుపేట: మండలంలోని పలు గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటడంతో పొలాలకు సరిపడా నీరు అందడం లేదు. గతంలో ఆరెకరాల పంటలకు నీరు అందించిన బోర్లు సైతం ప్రస్తుతం రెండెకరాలకు కూడా నీరు ఇవ్వడం లేదు. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. చాలామంది రైతుల పొలాల్లో నీరులేక నేల నెర్రెలు వారి కనిపిస్తోంది. గతంలో పోలిస్తే సగమే సాగుచేసినా.. దానికిసైతం నీరు అందించలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి పంటలు సాగు చేశామని.. పరిస్థితి చూస్తుంటే తమ పెట్టుబడి కూడా వచ్చేలా లేదని, తీవ్రంగా నష్టపోయేలా ఉన్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– సగానికి పైగా సాగు తగ్గినా ఇబ్బందులే

గత వేసవిలో మండలంలో 16 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారుల లెక్కలు చెపుతున్నాయి. కాగా తాజాగా నీరు లేక బోర్లు ఎండుతున్నాయని ముందుగానే కొంతమంది సాగు చేసేందుకు వెనకడుగు వేశారు. దీంతో తాజాగా వేసవిలో కేవలం 6450 ఎకరాల్లోనే వరి పంట వేశారు. దాదాపుగా సగానికంటే తక్కువే సాగైంది. అలాగే గత 6 సంవత్సరాలతో పోలిస్తే ఈ ఏడాదే రబీలో అతితక్కువ సాగుచేసినట్లు తెలిసింది. కాగా తాజాగా మండలంలో భూగర్భ జలాలు రోజు రోజుకు తగ్గిపోతున్నాయి. గత నెలలో 10.02 మీటర్ల లోతులో ఉన్న జలాలు తాజాగా 10.89 మీటర్ల లోతుకి పడిపోయాయి. దీనికి తోడు ప్రతి గ్రామంలో బోర్లు జోరుగా వేస్తున్నారు. గత నెల నుంచి నేటి వరకు మండలంలో దాదాపుగా 249 బోర్లు వేసినట్లు సమాచారం.



నీరింకిన నవాబుపేట చెరువు

పదేళ్లలో మొదటి సారి



గత పదేళ్లలో ఎప్పుడూ మా బోరు ఆపలేదు. 6 ఎకరాల పంటకు అవలీలగా నీరు అందేది. ప్రస్తుతం బోరు నుంచి ఆగి ఆగి నీరు వస్తోంది. 3 ఎకరాలు సాగుచేసినా.. అందులో సగం పంట నీరు అందక ఎండిపోయింది. మిగిలిందైనా దక్కించుకుంటామో లేదోనని అనిపిస్తోంది. పారుతుందా అంటే అనుమానంగా ఉంది.

– ముర్గని బాలకిష్టయ్య, కాకర్లపహడ్

వరి కష్టమే



వరి పంటకు నీరు అందించడం కష్టంగా మారింది. మొదట సాగు చేసిన సందర్భంగా ఎదోలా పండితే చాలు అనుకున్నాం. కానీ తీరా నీరు అందక పోవటంతో సగం వదిలేసి మిగతాది పండితే చాలు అనుకుంటున్నాం. కానీ బోర్లు మొరాయిస్తుండటంతో సగం పొలం సైతం పండడం కష్టంగానే మారింది. రెండెకరాలకు దాదాపుగా రూ. లక్ష ఖర్చు చేసి పంటలు వేశాం. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు.

– పాండు, హజిలాపూర్

పంచముఖ ఆంజనేయస్వామి ఉత్సవాలు

కోయిల్‌కొండ: మండలంలోని వీరంపల్లిలో ఘనంగా పంచముఖ ఆంజనేయస్వామి 21వ బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా ముందుగా స్వామివారికి అఖండదీపారాధన, అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలను నిర్వాహకులు చేపట్టారు. 28న రథోత్సవం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు వెంకటేష్ తదితరులు తెలిపారు.



హోమంలో పాల్గొన్న భక్తులు

భజనపోటీల విజేత తిమ్మయ్యపల్లి



బహుమతులు అందుకుంటున్న విజేతలు

నవాబుపేట: మండల పరిధిలోని ఆదిబసవేశ్వర దేవాలయ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి భజన పోటీల్లో తిమ్మయ్యపల్లి రామాంజనేయ భజన మండలి మొదటి బహుమతి గెలుచుకుంది. ద్వితీయ బహుమతిని వీరభద్ర భజన మండలి మందాపూర్, 3వ బహుమతి వీరాంజనేయ భజనమండలి గురుకుంట, 4వ బహుమతి శివాంజనేయ భజనమండలి కొండాపూర్, 5వ బహుమతి ఉమామహేశ్వర భజనమండలి వనపర్తిలు గెలుచుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో 34 భజన బృందాలు పాల్గొన్నాయి. వీరికి ఎంజేఆర్ యూత్, టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి నగదు బహుమతులు అందించారు. కాగా గురువారం శివపార్వతుల కల్యాణ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు జంగయ్య, పూజారులు శ్రీశైలం, రాజలింగం తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

దేవరకద్ర: రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కౌకుంట్ల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతు రుణమాఫీ చేయాలని, రైతుబంధు అందరికీ ఇవ్వాలని, వరి పంటలకు రూ. 500 బోనస్ అందజేయాలని అన్నారు. కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ ఎల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామరాజు, అనిల్‌కుమార్‌యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గుండాల రాఘవేందర్‌గౌడ్, నాయకులు రాజు, శ్రీను, బాలరాజు, శ్రీనివాసులుగౌడ్, శివచారి పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామి సేవలో ఎంపీ



బాలానగర్: మండల పరిధిలోని పెద్దరేవల్లి శివారులోని శ్రీ తిరుమలనాథ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం మూడురోజులుగా కనుల పండువగా సాగుతోంది. బుధవారం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, శ్రీదేవి సమేత ఇతర మూర్తుల ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచందర్ రెడ్డి, ఇతర నాయకులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సాదు వెంకట్ రెడ్డి, కొండక్ల విష్ణువర్ధన్, యాదయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాకమకొండలో వంశీచంద్‌రెడ్డి పూజలు



హన్వాడ: మండలపరిధిలోని ర్యాకమకొండ తిరుమలనాథ స్వామిని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. పూజారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయనను శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలు అందించారు. నాయకులు ఎన్పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు షబ్బీర్, చెన్నయ్య, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ తరగతులు



మిడ్జిల్: మండల పరిధిలోని చిల్వేర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గత 45 రోజులుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమంలో భాగంగా కరాటే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారంతో శిక్షణ పూర్తి అయినట్లు హెచ్ఎం శ్యామలకుమారి తెలిపారు. ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతో ఉపయోగ పడుతుందని వివరించారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళలలో విద్యార్థినులు ఎంతో చక్కగా కరాటే నేర్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గురుప్రసాద్, గౌడ్, వెంకటయ్య, హర్యా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా యాదిరెడ్డి

కోయిల్‌కొండ: బీజేవైఎం మండల అధ్యక్షుడిగా యాదిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేట బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాములుగౌడ్ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాలనగర్: మండల పరిధిలోని నేరళ్లపల్లి పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీఓ శరత్‌చంద్రబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎంపీ ఎన్నికల నిర్వహణకు ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టాలని కార్యదర్శికి సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల కమిటీ ఎన్నిక

దేవరకద్ర: కౌకుంట్ల మండల బీజేపీ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్‌రెడ్డి, కన్వీనర్ కుర్వరమేశ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామరాజు, అనిల్‌కుమార్‌యాదవ్, బీజేవైఎం మండల కమిటీ అధ్యక్షుడిగా గుముడాల రాఘవేందర్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు.

గెలుపుకోసం కృషిచేయాలి

మిడ్జిల్: ఎంపీ అభ్యర్థి డీకే అరుణ గెలుపుకోసం ప్రతి బీజేపీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని మండల ఇన్‌చార్జ్ జనార్దన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండలానికి వచ్చిన ఆయనను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. నాయకులు రాజేశ్వర్, తిరుపతి, నరేందర్, లక్ష్మారెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఇఫ్తార్

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రానికి చెందిన షఫీ బుధవారం ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలు కార్యక్రమంలో పాల్గొన్నారు. మజీద్ పెద్దలు ప్రత్యేక ప్రార్థలు చేశారు. ఈ విందుకు మద్దూరు, నిడ్జింత, భూనీడ్ తదితర గ్రామాలకు చెందిన ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలు హాజరయ్యారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



మహిళలతో మాట్లాడుతున్న సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 37వ వార్డు పరిధిలోని కమ్యూనిటీ హాలులో బుధవారం ప్రజలకు తడి, పొడి చెత్తపై మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. వివిధ ఆహార వ్యర్థ పదార్థాలను, కుళ్లిపోయిన కాయగూరలు, పండ్లు తదితర వస్తువులను తడి చెత్తగా భావించి ఆకుపచ్చ డబ్బాలో వేయాలన్నారు. ఇక ప్లాస్టిక్ కవర్లు, వేస్ట్ పేపర్లు నీలంరంగు డబ్బాలో, అలాగే పగిలిన గ్లాసులు, పాత టీవీ పరికరాలు, వాడి పడేసే విద్యుత్ బల్బులు, అద్దాలు, కాలంతీరిన ఔషధాలు తదితర వస్తువులను ఎర్ర డబ్బాలో వేయాలన్నారు. వేరు చేసిన వీటిని అనంతరం ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ స్వప్న, మున్సిపల్ సిబ్బంది మహేందర్, ఆర్పీ సరిత తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ కార్యక్రమం ఈనెల 28, 29వ తేదీలలోనూ వివిధ వార్డుల్లో కొనసాగనుంది.

నీటి కొరత లేకుండా చూడాలి

గండేడ్: గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ దేవన్న అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఉన్న బోర్లను మరమ్మతు చేయించాలని సూచించారు. వచ్చే హరితహారం కోసం నర్సరీలలో మొక్కలను పెంచాలని సూచించారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎక్కువ మొత్తం కూలీలు హాజరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వెన్నచేడ్‌లో పని ప్రదేశాలను పరిశీలించారు. ఎంపీఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవన్న

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రంలో నీళ్లు పోస్తున్న ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం క్లబ్ జోనల్ చైర్మన్ వలకొండ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవల్లో వాసవీ, వనితా క్లబ్‌లు తమవంతు భాగస్వామ్యం అవుతాయని అన్నారు. వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు చేరువలో ఉంటారని అన్నారు. గత 23 ఏళ్ల నుంచి వేసవికాలంలో చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు, వారి వెంట వచ్చే వారికి ఈ చలివేంద్రం ఎంతగానో ఉపయోపడుతుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవన్ అన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ డైరెక్టర్ రఘు, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు కలకొండ విట్యాల రామేశ్వర్, రీజియన్ చైర్మన్ కొక్కుల్ల చంద్రశేఖర్, జోన్ చైర్మన్ వలకొండ చంద్రశేఖర్, వాసవీ, వనితా క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన రోడ్డు పనులు



ప్రభుత్వ అతిథిగృహం పక్కన తవ్వివదిలేసిన రోడ్డు

- తవ్వి వదిలేయటంతో దుమ్ములేస్తున్న వైనం
- ఇబ్బందులు పడుతున్న పెద్దపల్లి ప్రజలు



పెద్దపల్లి రోడ్డుపై భారీవాహనం వెళ్తున్నప్పుడు లేస్తున్న దుమ్ము

జడ్చర్ల టౌన్: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయరహదారి కావేరమ్మపేట నుంచి పెద్దపల్లి వరకు రోడ్డు పనులు నిలిచిపోవటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉదండాపూర్ రిజర్వాయర్ కోసం భారీ వాహనాలు ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుండటంతో నిత్యం దుమ్ముధూళితో అవస్థలు పడుతున్నారు. రూ.9కోట్ల నిధులతో రోడ్డు పనులను ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారు. గత ఏడాది అక్టోబర్ నెలలో బీటి వేసేందుకు రోడ్డును తవ్వారు. కానీ అప్పటి నుంచి అలాగే వదిలేశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో జయప్రకాష్‌నగర్, బండమీదిపల్లి, పెద్దపల్లి, చిన్నపల్లి, వల్లూరు, ఉదండాపూర్‌తో పాటు 7తండాల ప్రజలు, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ వెళ్లాల్సిన వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భారీ వాహనాలు వెళ్లిన ప్రతిసారి పెద్ద ఎత్తున దుమ్ములేస్తుండటంతో ద్విచక్రవాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాల్లో వెళ్లే వారి కళ్లల్లోనూ దుమ్ము పడి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై వచ్చే దుమ్ము కారణంగా అనారోగాల బారిన పడుతున్నామని రోడ్డుకిరువైపులా ఉన్న గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్టోబర్ నెల నుంచి తమ పరిస్థితి భయంకరంగా మారిందంటున్నారు. ప్రభుత్వ అతిథిగృహం పక్కనుంచి పెద్దపల్లి గ్రామం శివారు ఉదండాపూర్ రిజర్వాయర్ కట్ట వరకు రూ.9కోట్లతో డబుల్ రోడ్డు మంజూరయ్యింది. నిర్మాణంలో భాగంగా మొదట 15కల్వర్టులు నిర్మించాలని ప్రతిపాదించారు. తీరా పనులు మొదలయ్యే సమయానికి 6కల్వర్టులు పెరిగి 21కు చేరాయి. దీంతో నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. కల్వర్టులు నిర్మించే సరికి ఎన్నికలు ముగిసి బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. స్థానికంగా ఎమ్మెల్యేగా అనిరుధ్‌రెడ్డి విజయం సాధించారు. కాంట్రాక్టర్ పనులు సక్రమంగా చేయటంలేదని, నత్తనడకన పనులు చేస్తున్నారని ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు.

పెరిగిన వ్యయం

కాగా రోడ్డు నిర్మాణ వ్యయం రూ.9కోట్ల నుంచి రూ.13.50కోట్లకు పెరిగింది. దీంతో పెరిగిన వ్యయం మంజూరీ కోసం ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ప్రతిపాదనలు ఇటీవలే ఆమోదం పొందాయి. ఆమోదం పొందిన నూతన ధరలకు రోడ్డు పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రోజూ ఇబ్బందులే

బీటీ వేసేందుకు రోడ్డును తవ్వి వదిలేయటంతో వచ్చే దుమ్ముతో రోజు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్దపల్లి నుంచి నిత్యం జడ్చర్లకు వెళ్లి వచ్చే సమయంలో భారీ వాహనాల కారణంగా అవస్థలు తప్పడం లేదు. త్వరగా రోడ్డు వేసి సమస్య తీర్చాలి.

–శేఖర్, పెద్దపల్లి

హైవే నుంచి రావాలంటే భయంగా ఉంది

44వ నంబరు జాతీయరహదారి ప్రభుత్వ అతిథిగృహం పక్కనుంచి 2కి.మీదూరంలో ఉన్న మా గ్రామానికి రావాలంటే భయంగా ఉంటుంది. ఎన్నికల ముందు రోడ్డు వేస్తామని అంతా తవ్వి వదిలేశారు. అప్పటి నుంచి వాహనాలు వెళ్లి వచ్చేటపుడు లేసే దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నాం.

–రాములు, బండమీదిపల్లి

వారంలోపుగా ప్రారంభం

కావేరమ్మపేట ప్రభుత్వ అతిథిగృహం పక్క నుంచి పెద్దపల్లి శివారు ఉదండాపూర్ రిజర్వాయర్ కట్ట వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు వారంలోపే ప్రారంభం కానున్నాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా 15కల్వర్టులు మంజూరీ కాగా 21 నిర్మించాల్సి వచ్చింది. దీంతో నిర్మాణవ్యయం పెరిగినందున పనులు ఆలస్యం అయ్యాయి. పెరిగిన వ్యయానికి ఆమోదం తీసుకోవాల్సి వచ్చినందున జాప్యం జరిగింది. ప్రస్తుతం ఆమోదం వచ్చింది. పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–పరమేశ్వర్, ఇన్‌చార్జ్ ఏఈ, ఆర్అండ్‌బీ